క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



కేపీ కొండారెడ్డిని సన్మానిస్తున్న చెంచిరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి చెంచిరెడ్డి సీనియర్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డి, ఏపీ పొల్యూషన్ బోర్డు మాజీ సభ్యుడు వెన్నా హనుమారెడ్డి, తర్లుపాడు జెడ్పీటీసీ వెన్నా ఇందిర, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్ తదితరులను కలిసి సన్మానించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్‌లో నమోదైన వారు బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అందరిపై ప్రత్యేక నిఘా ఉంచామని, సివిల్ సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, దాడులకు పాల్పడితే మళ్లీ జైలు జీవితం గడపాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా ఉంటూ, ప్రత్యామ్నాయ జీవనోపాధి చూసుకోవాలని చెప్పారు. ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పొదిలి టైలర్స్ కాలనీలో కార్డెన్ సెర్చ్



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

పొదిలి: పట్టణంలోని టైలర్స్ కాలనీలో దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత, తాళాలు వేసి ఉన్న ప్రతి ఇంటినీ గాలించారు. కొందరు అనుమానితులను విచారించారు. సరైన పత్రాలు లేని 40 వాహనాలను సీజ్ చేశారు. వాటిలో ఒక కారు కూడా ఉంది. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాలు కొనుగోలు చేసే సమయంలోనే అవసరమైన అన్ని పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు చూపించి స్టేషన్ నుంచి తీసుకెళ్లాలని డీఎస్పీ స్పష్టం చేశారు. తనిఖీలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు వేమన, బ్రహ్మనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

మార్కాపురం టౌన్: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలను కాలరాసే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు సంపద సృష్టించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని సమయాన్ని 8 నుంచి 10 గంటలకు పెంచుతోందని మండిపడ్డారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఐకేపీ తదితర విభాగాల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, వారందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ, పట్టణ కార్యదర్శి రూబెన్, నాగరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





చేరెడ్డివారిపల్లి నుంచి సిద్ధవరం వెళ్లే రోడ్డు దుస్థితి

నరక ప్రయాణం!

- దారుణంగా తయారైన గ్రామీణ రహదారులు
- అడుగేస్తే ఒళ్లు హూనమయ్యేలా రోడ్లు
- మరమ్మతుల సంగతే మరిచిన పాలకులు

కొనకనమిట్ల: 'సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తాం. ఎంచక్కా కొత్త అల్లుళ్లు రయ్‌మని కొత్త రోడ్ల మీద వెళ్లొచ్చు ఇవీ కూటమి ప్రభుత్వ పెద్దలు గత ఏడాది డిసెంబర్‌లో పలికిన ప్రగల్భాలు. ఈ ఏడాది సంక్రాంతికి ముందు కూటమి నాయకులు చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. సీన్ కట్ చేస్తే.. ప్రస్తుతం గ్రామీణ రోడ్లతోపాటు హైవేలు కూడా గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. కొనకనమిట్ల మండలంలోని చేరెడ్డివారిపల్లి నుంచి సిద్ధవరం గ్రామంలోకి వెళ్లే రోడ్డు నడవటానికి వీలులేని విధంగా తయారైంది. గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వరకు 3 కిలోమీటర్ల మేర తారు రోడ్డు, వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు, ఒంగోలు–గిద్దలూరు రహదారిలో బచ్చలకూరపాడు నుంచి తాడివారిపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారి అడుగడుగునా గుంతలతో అధ్వానంగా మారాయి. గనివానిపాడు రహదారిలో చప్టాల వద్ద ఇరువైపులా కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. రహదారుల అభివృద్ధి గురించి కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం మానేయడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమాదకరంగా గోతులు

పొదిలి: ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా పరిణమించాయి. వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో గుంతలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ ద్విచక్ర వాహనాల టైర్లు గుంతల్లో పడి అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఒంగోలు–నంద్యాల రోడ్డులో చిన్న బస్టాండ్ సమీపంలో, కాటూరివారిపాలెం దాటిన తరువాత, మార్కాపురం అడ్డరోడ్డు దగ్గర, కంభాలపాడు దగ్గర, దర్శి రోడ్డులో మల్లవరం బ్రిడ్జి వద్ద, ముసి బ్రిడ్జిపై నడి రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కంభాలపాడు వద్ద రోడ్డుపై గుంత





గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వెళ్లే రోడ్డు

కిరాత వారాహిగా జగదాంబమాత



మార్కాపురం టౌన్: స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు ఆదివారం కిరాత వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగదాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ఆలయ అర్చకులు ఆంజనేయప్రసాద్, వరుణ్‌తేజ బృందం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముద్దసానమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మార్కాపురం: మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి గ్రామ సమీపంలో వెలసిన ముద్దసానమ్మ గ్రామ దేవతకు ఆదివారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని జమ్మనపల్లి, కోలభీమునిపాడు, కొత్తపల్లి, నరవ, వేములకోట, మార్కాపురం పట్టణానికి చెందిన పలువురు భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ప్రత్యేక అలంకారంలో ముద్దసానమ్మ అమ్మవారు

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్లు సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారు

- హెచ్‌ఎం కర్నాటి దంపతులకు ఘన సన్మానం



తిరుపతిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: వృత్తిపై అంకితభావంతో పనిచేసిన కర్నాటి తిరుపతి రెడ్డి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఒ.వీరారెడ్డి కొనియాడారు. ఆదివారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వీరారెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారని పేర్కొన్నారు. అనంతరం కర్నాటి తిరుపతిరెడ్డి, కోటేశ్వరి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎం.చంద్రశేఖరరెడ్డి, గని వెంకటేశ్వర్లు, ఎస్‌బీవీఆర్ కృష్ణారెడ్డి, అమూల్య, ఎంవీఎస్ శర్మ, యూటీఎఫ్ జిల్లా, రాష్ట్ర నాయకులు ఆవుల సుబ్బారెడ్డి, ఐవీ రామిరెడ్డి, ఎస్.మధుసూదన్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ సీహెచ్ మాధవకృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బొల్లా బాలిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

గిద్దలూరు రూరల్: జన విజ్ఞాన వేదిక మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను సంస్థ నాయకులు ఆదివారం స్థానిక స్ప్రింగ్ బోర్డు స్కూల్ ఆవరణలో ఆవిష్కరించారు. జేవీవీ రాష్ట్ర నాయకులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 9, 10వ తేదీల్లో గిద్దలూరు ప్రాంతంలో జేవీవీ 18వ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలల్లో మూఢనమ్మకాలను పారదోలేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. వివిధ రంగాల్లో పని చేస్తూ జేవీవీలో సేవలందించేందుకు 30 వేల మంది సభ్యులు ఉన్నారని చెప్పారు. సైన్స్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ శాస్త్రీయ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జయప్రకాష్, ఎ.విశ్వరూపం, బాలునాయక్, ఎండీ రఫీ, జె.శేఖర్, అల్లూరయ్య, వి.శ్రీనివాసులు, గోపాల్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ స్వామి పల్లకి మోస్తున్న భక్తులు

కంభం: జగన్నాథ రథయాత్ర మహోత్సవం ఆదివారం కంభం పట్టణంలో కనుల పండువగా నిర్వహించారు. స్థానిక గచ్చు కాలువ వీధి నుంచి ప్రారంభమైన రథయాత్ర చౌక్ సెంటర్, అమ్మవారిశాలవీధి, మేదరవీధి, తెలుగు వీధి, కాపవీధి మీదుగా వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. గ్రామోత్సవంలో మహిళా భక్తుల కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహా నరసింహ కుంభపూజ, మహా పుష్పాభిషేకం, సంకీర్తనలు, హరేకృష్ణ మహామంత్ర జప యజ్ఞం, కృష్ణ బలరాముల పల్లకి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కంభం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో 1986వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా సాగింది. వివిధ రంగాల్లో రాణిస్తూ జీవితంలో స్థిరపడిన స్నేహితులందరూ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. కళాశాల చైర్మన్ రావూరి జనార్దన్, డైరెక్టర్ జయరామిరెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబా రెడ్డి, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల, బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీల్లో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఆర్టీసీ సర్వీసులకు సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే 99592 25702కు ఫోన్ చేసి తెలియజేయాలని డీఎం ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

వెలుగు సీసీకి సన్మానం

అర్ధవీడు: పదవీ విరమణ చేయనున్న వెలుగు సీసీ తలపాటి తిరుపతయ్యను దళిత బహుజన సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మిట్టమీదిపల్లెకు చెందిన తిరుపతయ్య నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత బహుజన సొసైటీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పులుసుగంటి శీల, దైవ సేవకులు జయరాజు, సామేలు, మోతుకూరి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.